

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహాలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 53 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

. 'శ్రీవిద్యావేత్తలు కదా తమరు!' అర్థోక్తిగా ఆగిపోయాడు విద్యాపతి. తను వెంటేసుకొచ్చిన అందరికీ నాయకుడిలా వున్నాడు. నడుమున చేతులు పెట్టుకుని నములుతున్న తాంబూలాన్ని దవడకు నొక్కిపెట్టి, తన సహచరులందరినీ కలయజూస్తూ అడిగాడు. ఆ ప్రశ్నలో వ్యంగ్యాన్ని గమనించీ చిరునవ్వుతో అందరికీ గౌరవంగా నమస్కరించాడు భాస్కరాచార్యులు. కూర్చోండి అన్నట్లు సంజ్ఞ చేశాడు మరొకసారి. గురువుగారు అలా వంగి వంగి వారికీ వినయంగా నమస్కరించడం సుతరామూ నచ్చలేదు నారాయణాచార్యులకు. వారికేం తెలుసు భాస్కరాచార్యుల మహిమ! ఎన్ని జన్మలెత్తితే అర్థం చేసుకోగలరు ఆయన అవతారపురుషుడని. ఉత్తరీయాన్ని భుజం మీదినుండి తీసి విదిలించి నడుముకు బిగించుకున్నాడు అప్పటికి మూడోసారి. పట్టరాని కోపం వస్తున్నది ఆ యువకుడికి.

గురువుగారికి రెండవ ప్రక్కనున్న మరొక శిష్యుడు జగన్నాథుడు కనులతోనే నారాయణుడిని మందలించాడు. గురువుగారికి నమస్కరించి తమరు కూర్చొనండి అని మౌనంగా సైగలతో విన్నవించాడు. కసిగా మెరిస్తున్న కళ్ళతో చూస్తున్నారు, కలహానికి దిగినట్లున్నారు కాశీ పండితులు.

విద్యాపతికి నమస్కరించి కూర్చుండబెట్టాడు. దర్పంగా తనవారిని కలయజూస్తూ ఆవుపేడతో అలికిన మట్టి అరుగుమీద కూర్చున్నాడు విద్యాపతి. తనవారికి సైగచేశాడు. వారూ కూర్చున్నారు.

సాయంకాలపు అరుణిమ ఆశ్రమాన్ని అభిషేకం చేస్తున్నది. గంగమ్మ గలగలలు కాశీపండితుల అజ్ఞానానికి సన్నగా నవ్వుతున్నట్టు వున్నాయి. విశ్వనాథుడి మందిరంనుండి మధురంగా శంఖనాదాలు వినిపిస్తున్నాయి. దశాశ్వమేధ ఘట్టం వద్ద జనుల కలకలం అంతకంతకూ పెరుగుతున్నది. గంగాహారతి సమయం దగ్గరపడుతున్నకొద్దీ అడుగుల చప్పుడు, వురుకులు పరుగులతో గంగా తీరానికి చేరుకుంటున్న సందడి పెరుగుతున్నది. జంతర్ మంతర్ తలుపులు మూస్తున్న కిర్రుమన్న గంభీరమైన ధ్వనులు వినిపిస్తున్నాయి. ఖగోళ యంత్రస్తూపం గంభీరంగా బంగారు రంగులో మెరిసిపోతున్నది. కైలాస నందికేశ్వరుడిని సవాలు చేస్తున్నట్లున్న వందల వృషభాలు రంకెలు మధురంగా వినిపిస్తున్నాయి.

యిప్పుడు చెప్పండి అన్నట్టు చూశాడు భాస్కరాచార్యులు. అంతే వ్యంగ్యంతో కొద్దిగా కోపాన్ని జోడించి మళ్ళీ అడిగాడు విద్యాపతి. 'తమరు శ్రీవిద్యావేత్తలు కదూ! ప్రతిభా ప్రదర్శనం కోసం త్రిలింగదేశంనుండి కాశీదాకా కాలు సాగించారట కదా! కాశీ పండితులకు, మహామహోపాసకులు మా కుంకుమానంద స్వామికి చెప్పి అనుమతి తీసుకున్నారా? అదేమిటి.. ఏమిటా పేరు?' అంటూ తన సహచరులవైపు చూశాడు. 'సౌభాగ్య ..' అని అందించబోయాడు ఆతడివెంట వచ్చిన వాళ్ళలో ఒక పండితుడు.

'ఆ! అదే! అదే! సౌభాగ్యభాస్కరం! అమ్మవారి సహస్రనామ భాష్యం అట కదా!' భుగ భుగలాడుతున్న చూపులు విసురుతూఊపిరి పీల్చుకోటానికి అన్నట్లు ఆగాడు విద్యాపతి. అవునన్నట్లు తల వూపుతూ ప్రశ్నార్థకంగా చూశాడు భాస్కరాచార్యులవారు. ఇప్పుడాయన ముఖంలో చిరునవ్వు స్థానంలో కొద్దిగా గాంభీర్యం చోటు చేసుకున్నది.

'లలితాసహస్రనామ భాష్యం వ్రాయడమంటే లల్లాయి కవిత్వం వ్రాయడమా! స్థానిక పండితులను, మహా మహోపాసకులు కుంకుమానందస్వామినీ పరిగణలోకి తీసుకునే పనిలేదా?' నేరారోపణ చేసి, నిలదీస్తున్నట్లు ఖంగుమన్నది విద్యాపతి గొంతు.

'నేను వ్రాయడమేమిటి! పరదేవతా కటాక్షం! అమ్మే అడిగి వ్రాయించుకున్నది. అయితే ఏమంటారు? తమరి బాధ ఏమిటి?' గంభీరమైన స్వరంతో అడిగాడు భాస్కరాచార్యులవారు. మహోపాసకుడి తీక్ష్ణత ఆ గొంతులో నిండింది యిప్పుడు. నారాయణస్వామి ముఖం సంతోషంతో విప్పారింది. 'ఇక మీ పని ఐపోయింది' అన్నట్టు తల వూపుతూ విద్యాపతిని, అతడి సహచరులనూ చూశాడు. తాను జాలిగా చూశాడు జగన్నాథుడు.

'ఏమంటాం! తమరి భాష్య ఉపన్యాసాలు కూడా చేస్తున్నారట కదా! ఒక్క సందేహం తమరి వద్ద తీర్చుకుందామని వచ్చాం! తమరు అనుగ్రహించాలి మరి' మరింత వ్యంగ్యంగా అన్నాడు విద్యాపతి.

సహచరుల ముఖాలలో ముసిముసినవ్వులు పూచాయి. అమాయకులారా అన్నట్లు చూసి, 'అడగండి' అన్నట్లు తల పంకించాడు భాస్కరాచార్యులవారు. 'మహాచతుష్షష్టి కోటి యోగినీగణసేవితా అన్న నామానికి తమరు ఏం భాష్యం వెలయించారో? ఆ పేర్లు, ఆ రూపాల వివరణ కావాలి' అన్నాడు విద్యాపతి ఏదో నేరానికి సంజాయిషీ కావాలి అన్నట్లుగా. మౌనంగా ఒక్క నిముషం కనులు మూసుకుని,

'అలాగా! రేపు ఉదయమునుండీ నిరాహారులై, సాయంత్రం గంగాహారతిసమయానికి గంగాతీరానికి రాండి! ఇక వెళ్ళిరండి!' అని ఆసనం మీదినుండి లేచాడు భాస్కరాచార్యులవారు. నారాయణుడు, జగన్నాథుడు ముందు నడుస్తుండగా గంగాతీరానికి బయలుదేరాడు హారతి దర్శనానికి.

★★★★★

గంగా తీరంలో వందలాది భక్తులు కాశీ విశ్వనాథుని స్మరణ చేస్తూ ఎదురు చూస్తున్నారు హారతి కోసం. సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. ఆకాశం అమ్మవారి సిందూరం పులుముకున్నట్లు వున్నది. గంగమ్మ సిందూరపు ఆకాశవస్త్రాన్ని తానూ లాక్కుని పోటీగా కప్పుకున్నది. గాలి కెరటాలకు రేగుతున్న సన్నని అలలు ఎగురుతున్న సిందూరపు రంగుచీర కుచ్చిళ్ళలా కదులుతున్నాయి. ముచ్చటగా కదులుతున్నాయి.

విశ్వమంతా విశాలాక్షి దయా వీక్షితమై, నింగీనేలా ద్విగుణితమై అరుణితమై పోయాయి. విశ్వమంతా అరుణ రాగరంజితమై పోయింది. విశ్వనాథుడు విశ్వేశ్వరీ రాగరంజితుడయ్యాడు. ఇంతలో దిక్కులు నిండేలా, గుండెలు పొంగేలా, తనువులు పులకించేలా, విశ్వమంతా నిండిన ఓంకారంలా శంఖధ్వానాలు చెలరేగాయి. గంటలు ఖంగుఖంగున మ్రోగాయి. ఆకాశపు అరుణిమను చీకట్లు కప్పేశాయి. తాను మాత్రం సిందూరవస్త్రాన్ని వదిలేది లేదన్నట్లుగా వందలుగా వెలిగిన హరతుల కాంతులతో మిలమిలలాడింది గంగాభవాని! సంధ్యాతాండవకేళీ వేళలో మూసిన మూడవ కంటిని పరిహసిస్తున్నట్లు హారతి జ్యోతులు తాండవం చేస్తున్నాయి. భేరీనాదాలు, శంఖనాదాలు, గంటానాదాలు, హర హర మహాదేవ నినాదాలు, మంగళహారతి గీతాలు కాశీని కైలాసాన్ని ఏకం చేశాయి.

నెమ్మదిగా నిశ్శబ్దం అలుముకుంటుండగా మరొక శంఖంలా మ్రోగింది భాస్కరాచార్యులవారి కంఠం. అల్లంత దూరంలో వేరొక స్నాన ఘట్టంలో నడుమువరకూ గంగలో దిగి వున్నాడు ఆయన. విశాలమైన రేవుమెట్లమీద వినోదంగా కూర్చున్నారు విద్యాపతి బృందం. రెండుచేతులూ జోడించి విశ్వనాథుడి గోపుర ధ్వజానికి నమస్కరించాడు. 'వివరణ అడిగారుగా! విని తట్టుకొన గలరా? వినిపిస్తే చాలునా? చూపితే చూడగలరా?' విశ్వనాథుని గుడి జేగంటలా మ్రోగింది ఆయన కంఠం. తెలియకుండానే అందరి శరీరాలు కంపించడం మొదలుబెట్టాయి.

'దివ్య యోగిని! మహాయోగిని! సిద్ధయోగిని!..' అంటూ ఆయన కంఠం మ్రోగుతున్నది. ఆవాహన చేస్తున్నట్లుగా రెండు చేతులూ విన్యాసం చేస్తున్నాయి. గాలిలో అంతవరకూ లేని ఏదో కలకలం చెలరేగింది. ముందు యేవో గుసగుసలుగా సన్నని ధ్వనులు మొదలై భాస్కరచార్యులవారి గొంతు అనేక గొంతులుగా వినిపిస్తున్నది.

ఒక గొంతు కీచుగా వికృతంగా వున్నది. ఒక గొంతు ఉరుములు వురిమినట్లుగా వున్నది. ఒక గొంతు సుకుమారంగా సమ్మోహనకరంగా వున్నది. మరొక గొంతు గంభీరంగా సింహనాదంలా గుండెలు దడదడలాడేలా వున్నది. వేరొక గొంతు మదపుటేనుగు ఘీంకారంలా దిక్కులు పిక్కటిల్లినట్లుగా వున్నది. ఒకగొంతు లేతగా పదేళ్ళ బాలిక గొంతులా వున్నది. పోటీపడి ఆ గొంతులు పలుకుతున్నాయి. ఒక గొంతులో మరొకటి కలిసిపోతూ, ఏ ఒక్కటీ స్పష్టంగా వినిపించకుండా ఒకేసారి ఎన్నో గొంతులు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క గొంతు ఒక్కొక్క భావాన్ని శ్రోతలకు కలిగిస్తున్నది. కొన్ని నిముషాలకు చెవులు పనిచేయకుండా పోయిన భావం కలిగింది. అంతు తెలియని కొండగుహలో ఒకేసారి పదులకొద్దీ గొంతులు మ్రోగినట్లు, వందలకొద్దీ ప్రతిధ్వనులు చెలరేగినట్లు చెవులు బద్దలై పోతున్నాయి.

కర్ణభేరి పగిలి చెవులవెంట రక్తం కారుతున్న భావన కలిగింది విద్యాపతికి. తాను ఎవరో, ఎక్కడున్నాడో, ఏం జరుగుతున్నదో తెలియనట్లు, పిచ్చెక్కినట్లు భావన కలిగింది. తనకు వత్తాసుగా వచ్చినవాళ్ళు కొందరు రెండు చెవులూ మూసుకుని దొర్లడం కనిపిస్తున్నది. చెవులు మూసుకునే శక్తి కూడా లేనట్లుగా కంపిస్తున్న శరీరాలు మెలికలు తిరుగుతున్నాయి. లేచి అక్కడినుండి పరుగెత్తి పారిపోవాలి అనుకున్నాడు. లేచి నిలబడే శక్తి కూడా లేకపోయింది. తన శరీరం నిలువెల్లా వణికిపోతున్నట్లు తెలుస్తున్నది. పళ్ళబిగువున బలవంతంగా లేచి నిలుచున్నాడు. అంతవరకూ కూడదీసుకున్న శక్తి హరించుకుపోయింది. కుప్పకూలిపోయాడు. అతడి మనసులో యిప్పుడు భయంకలిగింది. ఒక్కడే యిన్ని గొంతులతో ఎలా మాట్లాడుతున్నాడు అన్న సందేహం కలిగింది. బైర్లు కమ్ముతున్న కనులకు వడివడిగా వస్తున్న కుంకుమానంద స్వామి కనిపించాడు.

పరుగెత్తినట్లు వస్తూనే దండ కమండలాలు గట్టున పెట్టి రెండుచేతులూ శిరస్సుమీద జోడించి భాస్కరాచార్యులవారికి నమస్కరించాడు కుంకుమానందస్వామి. పేరుకు తగ్గట్టే కాశ్మీర కుంకుమ రంగులో పండుపండినట్లు మెరిసిపోతున్న డెబ్భై ఏళ్ళ వృద్ధుడు ఆయన. ఆయన పాదాలమీద పడిపోయాడు విద్యాపతి. 'ఒక్కడే..ఒక్కడే..యిన్ని గొంతులతో..' అంతకంటే అడిగే శక్తి లేకపోయింది అతడికి. చిరునవ్వుతో కమండలాన్ని అందుకున్నాడు కుంకుమానందస్వామి. అందులోని నీళ్ళతో విద్యాపతికి, మిగిలినవారికీ కనులు తుడిచాడు స్వయంగా! గంగానదిపై ఆకాశాన్ని చూపించి రెండు చేతులూ శిరస్సున అంజలించాడు.

అప్పుడు కనబడిన దృశ్యానికి నేనే సాక్షిని మిత్రమా! పాఠకుడా! కాలసాగరంలో అది ఒక అల! ఒక అందమైన కల! ఎవరోకాదు సుమా, కాలపురుషుడు కన్న కల! పృథ్వి మొత్తమూ భవానీ ద్వీపం కాదూ? చరాచర విశ్వమంతా చాముండీ చింతామణిద్వీపం కాదూ? అనంత కాలసాగరాన్ని వీక్షిస్తూ అమ్మ! అంతులేని జన్మపరంపరల అలలతో పాద్యమిచ్చే మట్టిబొమ్మ! హ హ హ! అర్థం కాని వేదాంతమా? ఆది, అంతము, అనంతము వేదాంతమే! మిగిలినదంతా కడకు అంతమే!

గంగానదిపైన ఆకాశమంతా ఆవరించిన అమ్మ! అరవైనాలుగు రూపాలలో అమ్మ కనిపిస్తున్నది అందరికీ! అరవై నాలుగు ఆకృతులు! ఏ ఒక్క ఆకారమూ వేరొకదానిలా లేదు. దేనికదే విభిన్నంగా వున్నది. అయినా అన్నిటిలో ఒకే వెలుగు కనిపిస్తున్నది! ఒక ముగ్గురు యోగినులలా వున్నారు. ఒక తల్లి మహేశ్వరీ స్వరూపంలో వున్నది. ఒక పెద్దమ్మ పిశాచ స్వరూపిణిగా భయంకరంగా వున్నది. ఒక అమ్మ లక్ష్మీ స్వరూపిణిగా వున్నది. మహాకాళిగా ఒక జనని దర్శనమిస్తున్నది. మృతశరీరాన్ని పీక్కుని తింటున్నది ఒక భయంకర రూపిణి! పీనుగమీద కూర్చుని వున్నది ఒక శక్తి! ప్రతి రూపమూ పలుకుతున్నది. తనను తాను చెప్పుకుంటున్నది. కొందరు మధురంగా పలుకుతూ మందహాసం చిందిస్తున్నారు. కొందరు వికృత కంఠధ్వనులతో గుండెలు అవిసేలా అరుస్తున్నట్లుగా పలుకుతున్నారు.

ఒక్కొక్క స్వరూపాన్ని చూస్తూ నిలువెల్లా ఆనందంతో కంపించిపోతున్నాడు కుంకుమానందస్వామి. ఆయన కనులవెంట ఆనందబాష్పాలు కంఠాన్ని, వక్షస్థలాన్ని తడుపుతూ అంగవస్త్రాన్ని తడుపుతున్నాయి. అలా ఎన్ని క్షణాలో ఎంతసేపో తెలియలేదు ఎవరికీ. గాలిలో కరిగిపోయినట్లుగా ఆ ఆక్రుతులన్నీ మాయమైపోయాయి.

నిశ్శబ్దం అలుముకున్నది! అంతలోనే భాస్కరచార్యులవారి కుడిభుజం మీద లలితాస్వరూపంతో అమ్మ దర్శనమిచ్చింది. ఎడమ కుడిగా ధనుర్బాణములు క్రింది రెండుచేతులలో, పాశము, అంకుశము పై రెండు చేతులలో ధరించి వున్నది. ఆయన ఎడమ భుజం మీద శ్యామలా స్వరూపంతో అమ్మ ఆశీనురాలై వున్నది.

నాలుగు భుజాలతో మరకత పచ్చ కాంతితో మెరిసిపోతున్నది! దివ్యమైన వీణను మ్రోగిస్తూ మందహాసం చిందిస్తున్నది. ఆ మూర్తులను చూసి ఆనందంతో స్తంభించిపోయాడు కుంకుమానందస్వామి. ఒంటిపాదం మీద రెండుచేతులూ జోడించి అలాగే సమాధిలోకి వెళ్ళిపోయాడు. గాలికి ఎగురుతున్న ఉత్తరీయాన్ని కప్పిన శిలాప్రతిమలా ఐపోయాడు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కూడా నిలిచిపోయాయి. చూస్తున్న దృశ్యాన్ని మెదడు గ్రహించినంతలోనే ఆ మూర్తులు మాయమైపోయాయి. నడుములోతు నీళ్ళలో సమాధి స్థితిలో నిలిచిన భాస్కరచార్యులవారు మాత్రమే దర్శనమిచ్చారు.

భయంతో స్పృహ కోల్పోయారు కొందరు. యాభై మెట్లూ దొర్లుతున్నట్టుగా ఎప్పుడు దిగాడో, భాస్కరాచార్యుల ముందు నడుములోతు గంగలో రెండు చేతులూ జోడించాడు విద్యాపతి. పసిపిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడవడం మొదలుబెట్టాడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS